


## చిన్నమాట

కథ అందరికీ నచ్చే సాహిత్య ప్రక్రియ. బాల్యం నించే మనిషికి కథలంటే ప్రీతి. అందుకే తెలుగులో వార, మాసపత్రికల్లో కథలు తప్పనిసరి. ఆఖరికి ఆదివారం అనుబంధాల్లో కూడా. కథా సరిత్సాగరం, కాశీ మజలీ కథలు, పంచతంత్రం కథలు.... ప్రతి సంస్కృతికీ ఇలాంటి కథలున్నాయి. తెలుగు కథల నేపథ్యానికి విస్తృతి లేదు. ఈనాటికీ అవి ఎదగలేదు. ప్రేమ, కుటుంబం, జానపదం, హాస్యం, ఇంకా ఆఫీసు కథలు, కమ్యూనిస్ట్ కథలు, తెలుగు కథలు ఇలా కేవలం పరిమిత ఇతివృత్తాల చుట్టూనే తిరుగుతున్నాయి.

కమ్యూనిజం, స్త్రీవాదం, దళితవాదం కథలని అతి గొప్ప కథలుగా చలామణి చేసే ప్రయత్నం కొన్ని పదుల సంవత్సరాలుగా జరుగుతోంది. కథల పోటీల్లో అవార్డులుకూడా ఈ కథలకే వస్తూండడం కూడా మనం గమనించవచ్చు. ఈ మధ్య యువరచయితలనుంచీ స్వలింగ సంపర్కం లాంటి జుగుప్సాకరమైన కథలు కూడా వస్తున్నాయి.

తెలుగులో 1950-1960లలో వెలువడ్డ కథలు ఈనాటికీ గుర్తుండిపోయే మంచి కథలు. ఆనాటి రచయితలు ఏ వాదానికీ కట్టుబడకుండా మానవ జీవితాల్లోని సున్నిత అంశాలతో కథలు రాసారు.

విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, యూరప్‌లలో కథా ఇతివృత్తం ఎంతో విస్తృతమైందని వారి పత్రికలు చదివాక నాకు అర్థమైంది. విపుల మాస పత్రిక ఆరంభించినప్పటినించి నేను వాటిని తెలుగులో అనువదిస్తున్నాను.

చిన్నప్పటినించి నాకు క్రైం కథలంటే ఇష్టం. ఆ రకం కథల ఇతివృత్తాలు కూడా ఎంతో విస్తృతమైనవి. హత్య, పరిశోధనే కాకుండా లాక్డ్ రూమ్ మిస్టరీస్, పజిల్స్, అతీంద్రియ కథలు, ట్విస్ట్ కథలు, హాస్యం, చరిత్ర, జానపద నేపథ్యం, కిడ్నాపింగ్, పగ, ప్రతీకారం, బ్లాక్ మెయిలింగ్ కథలు ఇంకా కిరాయి హంతకులు, వృద్ధులు, పిల్లలు, జంతువులు ప్రధాన పాత్రలుగాగల కథలు, రోడ్ కథలు, హృదయాన్ని స్పందింపచేసే కథలు... ఇలా వాటిలో ఎన్నో డివిజన్స్ ఉన్నాయి.

అలాంటి కథలని తెలుగు పాఠకులు ఈ నెలనించి కౌముదిలో నెలకి ఒకటి చదవగలరు. తెలుగు కథా వీధుల్లో లభ్యం కాని ఈ వినూత్న కథలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని ఆశిస్తూ ...

మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి.

# కథ పేరు: గూఢచారిణి

## { డిక్ యాష్ బౌ కథకి స్వేచ్ఛానువాదం }

**టు మిస్ మిరియం కెనడీ,**

డెక్స్టర్ హాల్,

స్టేట్ యూనివర్సిటీ.

డియరెస్ట్ మిమీ,

నువ్వు నాకు భలే పని పెట్టావు. నేను పాల్ హారిసన్ మీద ఓ కన్నేసి ఉంచి, హైస్కూల్లో క్లాస్‌కి ఎలా హాజరవ్వగలను? మనం అక్కాచెల్లెళ్ళు కాకపోయినా, వారానికి నువ్వు నాకు ఇస్తానన్న ఇరవై డాలర్ల అవసరం నాకు లేకపోయినా నేనిందుకు ఒప్పుకునేదాన్నికాదు. ఇంగ్లీష్ టీచర్ మిస్ హాట్‌కిన్స్ అటెండెన్స్ తీసుకున్నాక నేను బయటికి వెళ్ళడానికి ఒప్పుకుంటుంది.

పాల్ గురించిన తాజా రిపోర్ట్. అతన్ని నిన్న నేను ఓ అమ్మాయితో చూశాను. ఫుట్‌బాల్ ప్రాక్టీస్ తర్వాత మేము మాలెడ్ మిల్క్ షాప్‌కి వెళ్ళాము. నాకు బట్టలు అల్మరాలో అనుకోకుండా నీ కాశ్మీర్ స్వెటర్ కనిపిస్తే దాన్ని తొడుక్కున్నాను. అందుకు నువ్వేమీ అనుకోవు అనుకుంటున్నాను. అది నీకు నచ్చలేదని, అందుకే దాన్ని హాస్టల్‌కి తీసుకెళ్ళలేదని అనుకున్నాను. నాతోపాటు టూటీ, శాలీ కూడా ఉన్నారు. పంతొమ్మిది ఏళ్ళ టామీ కూడా. అతని హైస్కూల్ విద్యార్థి కాదు కాబట్టి అతన్ని మా దగ్గర కూర్చోనివ్వలేదు. క్రూ కట్‌లో ఉన్న టామీ అందంగా కనిపించాడు. క్రితం వేసవిలో అతని క్రాఫ్ నాకు నచ్చేది కాదు.

మాల్టెడ్ మిల్క్‌షాప్‌లాంటి చోట్లకి నేను పాల్‌ని అనుసరించాలంటే, నాకు నువ్వు అదనంగా డబ్బు ఇవ్వాలి. గూఢచారిగా  పనిచేయటానికి శక్తి కావాలి కాబట్టి నేను హాట్ ఫజ్ తాగాను. పాల్ నీలం రంగు టై కట్టుకున్నాడు. బానే ఉన్నాడు.

**మోలీ**

**గూఢచారిణి**

మంగళవారం.

స్టడీ పిరియడ్. నేను ఆల్జీబ్రా చేస్తున్నట్లు నటిస్తూ ఈ ఉత్తరం రాస్తున్నాను.

**డియర్ మిమీ,**

'కాశ్మీర్ స్వెటర్ గురించి నీకు అంత కోపం వచ్చి ఉండకూడదు. నాకా రంగు ఎటూ నచ్చలేదు. మరో విషయం నువ్వు నా జీవితాన్ని ఆపకూడదు. అందుకో చట్టం ఉంది. కనీసం ఉందనే నేను నమ్ముతున్నాను. పాల్‌తో ఉన్న అమ్మాయి గురించి నువ్వు భయపడాల్సిన అవసరం లేదు. కాకపోతే ఆమె నీ కన్నా అందమైన, బంగారు రంగు జుట్టు ఉన్న అమ్మాయి. ఆమె చర్మం అంత మృదువుగా అందంగా ఉండటానికి కారణం, ఆమె అన్ని రకాల క్రీములు వాడుతుందని పందెం. టూటీ చెప్పడం, లోపలి తొడుగులు లేకుండా ఎవరికీ అలాంటి ఫిగర్ ఉండదు. అవి లేకపోతే నీకు ఆమెలోని సగం ఉందనే చెప్పాలి.

వాళ్ళు మా టేబుల్ పక్కనించి వెళ్ళేప్పుడు పాల్ మా టేబుల్ దగ్గర ఆగి నాకు హలో చెప్పాడు.

'హలో మోలీ ఎలా ఉన్నావు?' అన్నాడు. తర్వాత చేతిలోని టోపీని తిప్పుతూ అమ్మా నాన్నల గురించి అడిగాడు. ఆ తర్వాత మరొకరి గురించి అడగటానికి నిశ్చయించుకున్నట్లుగా ఆలోచిస్తూ ఆగి చివరికి అడిగాడు. 'స్పాట్ ఎలా ఉంది?'

ప్రతి రోజు నేను వాకింగ్‌కి స్పాట్‌ని వాళ్ళ ఇంటి పక్కనించే తీసుకెళ్తుంటాను. సిల్వియా అతని పక్కనే నుంచుని నా వంకే కోపంగా చూస్తూ ఉండిపోయింది. శాలీ నాకు ఆమె పేరు సిల్వియా ప్రెటిస్ అని, వాళ్ళ నాన్న మేయర్ పదవికి పోటీ చేస్తున్నాడని చెప్పింది. వాళ్ళు బాగా డబ్బున్నవాళ్ళు. అందుకే క్రీం కలర్ స్పోర్ట్స్ కారు వేసుకొచ్చింది. ఆమెకి ఆ కారు తగినదే అనుకున్నాం. ఐనా నువ్వు భయపడాల్సిందేమీ లేదు.

**లవ్**

**మోలీ.**

ఆదివారం మధ్యాహ్నం.

**డియర్ మిమీ**

నిన్ననే మీ ఉత్తరం వచ్చింది. ఊరికే ఎందుకలా ఎక్సైట్ అవుతావు? నేను సాధ్యమైనంత ఎక్కువగా గూఢచర్యం చేస్తున్నాను. నువ్వు హాస్టల్‌కి వెళ్ళే మునుపు పాల్‌తో మాట్లాడి అతనికి నిశ్చితార్థపు ఉంగరం తిరిగి ఇవ్వకుండా ఉండాల్సింది. 20 డాలర్లకి థాంక్స్. గత రెండు రోజులుగా నేను చాలా కష్టపడి పనిచేసాను.

ఒకేసారి రెండు చోట్ల గూఢచర్యం చేయాల్సిన అవసరం ఉండటంతో, శాలీతో ఒట్టు పెట్టించుకుని నా సహాయకురాలిగా తీసుకున్నాను. దీని గురించి నువ్వు ఎవరికీ చెప్పొద్దు అన్నావు. కానీ శాలీ ఓకే. నా సంగీతం పుస్తకం లోపల పేజీలో కాంట్రాక్ట్ మీద శాలీ సంతకం చేసింది. ఆమె ఏదైనా వాగితే దానిమీద దావా వేస్తాను. ఈ గూఢ చర్యంలోని ఏకైక కష్టం, అది రాజకీయాలతో కలిసి ఉంది. నిన్న రాత్రి భోజనాల దగ్గర నాన్న, సిల్వియా తండ్రి ప్రెటిస్ ఎన్నికైతే మన ఊరికి కష్టం వచ్చినట్లేనని చెప్పారు. వాళ్ళు బయటి ఊళ్ళలోని జూదరులతో స్నేహం చేస్తారు.

నేను అమాయకత్వం నటిస్తూ ప్రెటిస్ కూతురితో పాల్ డేట్ చేస్తున్నాడని చెప్పాను, వెంటనే నాన్న ఇలా చెప్పారు.

'అయ్యో! మొదట వాళ్ళు ఓ యువ దినపత్రిక విలేఖరితో ఏదో విధంగా పరిచయం చేసుకుంటారు. పాల్ ఈ ఊళ్ళోని అతి తెలివైన పత్రికా విలేఖరి కాబట్టి, అతనితో ఈ పరిచయం జరిగి ఉంటుంది. ఆ దినపత్రిక ప్రచురణ కర్త రోత్రో రాజకీయాల్లో ఎవరివైపు పక్షపాతం చూపించడు కాబట్టి ప్రైటిస్‌ని వాళ్ళు విమర్శిస్తారు. ఆ పత్రికలో పాల్ ద్వారా తమ పబ్బం గడుపుకోవాలని వాళ్ళు భావిస్తూ ఉండచ్చు.'

నేను, టూటీ, శాలీ మరికొందరు మిత్రులం శనివారం నాన్న సివిక్ కమిటీ ఉత్తరాల కవర్లు అతికించిపోస్ట్ చేసాం. 841 స్టాంప్స్‌ని ఎప్పుడైనా వరసగా నాకావా? కానీ వాటిని అందుకున్న వాళ్ళు తెరవకుండానే చెత్తబుట్టలో పడేస్తారని అనుకున్నాను. పాల్ గురించి కొత్త సమాచారం లేదు. నిన్న మేము లంచ్‌కి వెళ్ళినప్పుడు, పాల్ దినపత్రిక ఆఫీస్ బయట సిల్వియా స్పోర్ట్స్ కారు కనిపించింది. అప్పుడే వాళ్ళిద్దరూ బయటికి వచ్చారు. అతను డ్రైవింగ్ సీట్లో కూర్చున్నాడు. మింక్ కోట్‌లోని ఆమె అతని పక్కన కూర్చుంది. పాల్ నెత్తిమీద బూడిద రంగు కొత్త టోపీ ఉంది. నాకు రైటర్స్ క్రాంప్ వచ్చింది కాబట్టి తర్వాత మళ్ళీ రాస్తాను.

**లవ్**

**మోలీ.**

సోమవారం, ఆర్ట్ క్లాస్.

**డియర్ మిమీ,**

ఇవాళ పొద్దున మాకు ఆర్ట్ క్లాస్ ఉండటం అదృష్టం. నేను పావురం బొమ్మని పావుగంటలో గీసి రంగులు వేసి ఇచ్చాను. మేము ఇవాళ పక్షుల బొమ్మలు గీస్తున్నాం. కొందరు సరిగ్గా గీయలేదు. ఈ పీరియడ్ మొత్తం నాకు సమయం ఉంది కాబట్టి శనివారం రాత్రి జరిగింది చెప్తాను. నీకు ఆ రోజు అమ్మ పుట్టినరోజు అని తెలుసు. డిన్నర్‌కి నాన్న మమ్మల్ని రివేరా గార్డెన్స్‌కి తీసుకెళ్ళారు. అన్నట్లు అమ్మకి నువ్వు పంపిన పేంటీ, బ్రా ఉన్న పేకేజ్ అందింది. అది చూసి అమ్మ కొద్దిగా సిగ్గుపడింది. వద్దనుకుంటే దాన్ని నీకు పిచ్చెక్కిందా?' అని తిప్పి పంపుతుంది. 'డిన్నర్‌కి నువ్వు దాన్ని వేసుకుంటున్నావా?', అని అడిగితే ఎంత కోపంగా చూసిందో.

నేను తింటూ గూఢచర్యాన్ని చక్కగా చేసాను. కారణం, ప్రైటిస్, మనుషులు నా పక్కన టేబుల్ మీదే పార్టీ చేసుకుంటున్నారు. సహజంగానే పాల్ కూడా డిమ్మర్ జాకెట్‌తో అక్కడ ఉన్నాడు. ఆ అమ్మాయి తెల్లటి సాటిన్ గౌన్‌లో ఎంత అందంగా ఉందో చెప్పలేను. చెపితే నువ్వు బాధపడతావు. ఆ పార్టీలో సుమారు పన్నెండు మంది ఉన్నారు. ఈ ప్రపంచానికి చెందని వాళ్ళలా కనిపించారు. వజ్రాల ఉంగరాలు ధరించిన ఒకరిద్దరు మగాళ్ళు షేవ్ చేసుకోకపోవడంతో నాకు నచ్చలేదు. నాన్న అమ్మతో వాళ్ళు ఇంకో ఊరినించి వచ్చిన జూదగాళ్ళని చెప్పారు.

నేను లేడీస్ లాంజ్‌లోకి వెళ్ళినప్పుడు, చక్కగా గూఢచర్యం చేసాను. సిల్వియా, ఆమె స్నేహితురాలు అద్దం ముందు నిలబడి పౌడర్ రాసుకుంటూ ఉంటే, నేను వాళ్ళ వెనక నిలబడి లిప్ లిప్‌స్టిక్ ని బయటికి తీసాను. అది వైల్డ్ స్ట్రాబెర్రీ అనే కొత్త లిప్‌స్టిక్. వాళ్ళిద్దరూ కబుర్లు చెప్పుకుంటున్నారు.

'సిల్వియా నాకు అర్థం కావటంలేదు. నువ్వు ఈ విలేకరి చుట్టూ ఎందుకు తిరుగుతున్నావు? అతను బావున్నాడు కానీ డబ్బులేనివాడు' ఆమె స్నేహితురాలు అడిగింది.

సిల్వియా తన పొడవైన, అందమైన బంగారు రంగు జుట్టుని దువ్వుకుంటూ బదులు చెప్పింది.

'చూడు యూనిస్, నేను నాన్నకోసం ఈ పని చేస్తున్నాను. ఇతన్ని నేను చెప్పినట్లు వినేలా చేస్తే నాన్న నన్ను యూరప్‌కి పంపిస్తారు. '

'ఓహో! ఇప్పుడు అర్థమైంది. మంచి పని' స్నేహితురాలు చెప్పింది.

"అవసరమతే నేను అతన్ని పెళ్ళి కూడా చేసుకుంటాను. తర్వాత పాత సింగిల్ గ్లౌ లాగా వాడిని విసిరేస్తాను."

ఆ సమయంలో సిల్వియా వెనక్కి తిరిగి నన్ను చూసి కోపంగా అరిచింది.

"తల్లి తండ్రులు పిల్లల్ని ఇలాంటి చోట్లకి ఎందుకు తెస్తారో నాకు అర్థం కాదు."

నన్ను పిల్లా అన్నది. ఏదో ఓ రోజు జవాబు చెప్తాను.

నేను వెనక్కి తిరిగి వెళ్ళాక చూస్తే, పాల్ మా టేబుల్ దగ్గర ఉన్నాడు. కానీ అమ్మా నాన్న అతనితో చాలా ముభావంగా ఉన్నారు. పాల్ నన్ను తనతో నృత్యం చేయమని కోరాడు. నాన్న ఏదో చెప్పబోతుంటే అమ్మ బల్లకింద నాన్న కాలిని తన్నడంతో ఆయన నోరు మూసుకున్నాడు. పాల్ నాతో డాన్స్ చేస్తూ, మాట్లాడుతూ తడబడుతుంటే అతడేం మాట్లాడాలనుకుంటున్నాడో తెలుసు కాబట్టి నేను చెప్పాను.

"నువ్వు మిమీ గురించి అడగాలనుకుంటే అనవసరం. మిమీ చాలా అదృష్టవంతురాలు, నిజానికి అమ్మానాన్నా కొద్దిగా బాధపడుతున్నారు కూడా."

"ఎందుకు బాధ పడుతున్నారు?" పాల్ అడిగాడు.

దాంతో నేను నీకు ఓ ఫుట్‌బాల్ టీం కెప్టెన్‌తో నిశ్చితార్థమైందని, కేంపస్‌లో వాళ్ళంతా ఇదే మాట్లాడుకుంటున్నారని చెప్పాను.

నువ్వు థాంక్స్‌గివింగ్ సెలవులకి ఇంటికి వస్తావా అని అడిగాడు. రాకపోవచ్చని, అతని తల్లితండ్రులు లాంగ్ ఐలాండ్‌లోని తమ ఎస్టేట్‌కి నిన్ను ఆహ్వానించారని చెప్పాను. నువ్వు అమ్మానాన్నలకి ఆ అబ్బాయిని పరిచయం చేయకుండానే పెళ్ళి చేసుకుంటావని వాళ్ళు బాధపడుతున్నారని చెప్పాను.

పాల్ 'అలాగా?' అన్నాడు. అతని మొహంలో కోపం కనిపించింది. అతను మళ్ళీ నన్ను మా టేబుల్ దగ్గర వదిలాడు. నేను అతన్ని తందామనుకున్నాను. ఎందుకంటే అతనికి డాన్స్ చేతకాదు. అదిగో బెల్ మోగింది. నేను క్లాస్‌కి వెళ్ళాలి.

**లవ్ మోలీ**

**పి.ఎస్: నీకు ఫుట్‌బాల్ కెప్టెన్‌తో పరిచయమా?**

**గురువారం**

**డియర్ మిమీ,**

ఇవాళ మధ్యాహ్నం స్కూల్ నించి వచ్చాక నువ్వు స్పెషల్ డెలివరీలో పంపిన ఎక్స్‌ట్రా డబ్బు అందింది. నేను నిజంగా నీ కాశ్మీర్ స్వెటర్‌ని తీసుకోవచ్చా? దాని రంగు నాకిష్టం. ఇక్కడ అనేకం జరుగుతున్నాయి. వచ్చే మంగళవారమే ఎన్నికలు. ప్రెటిస్‌ని ఓడించడం కష్టమని నాన్న అంటున్నారు. ఊరు నిండా వాళ్ళ పోస్టర్లే. పాల్ దినపత్రికలో ఉద్యోగాన్ని వదిలేసాడు. చివరికి పాల్ తెలివి తెచ్చుకున్నాడని నాన్న మొదట్లో ఆనందపడ్డారు. కానీ పాల్ ఏం చేసాడో తెలుసా? నువ్వు ఊహించలేవు. ప్రెటిస్ ఎన్నికల కేంపైన్ మేనేజర్ ఉద్యోగంలో చేరాడు. అది తెలిసి నాన్న నుదుటి మీద ఐస్ బేగ్ పెట్టుకుని పడుకున్నారు.

నేను, శాలీ ప్రెటిస్ వాళ్ళ హెడ్ క్వార్టర్స్‌లో గూఢచర్యం చేస్తున్నాం. పాల్‌ని శాలీ అనుక్షణం అనుసరిస్తుంది. నాన్న ఐస్‌బేగ్‌ని వాడిన రోజు పాల్‌కి ఫోన్ చేసి భోజనానికి ఆహ్వానించారు. వాళ్ళ మధ్య జరిగిన చిత్రమైన సంభాషణ నాకు అర్థం కాలేదు. వాళ్ళవైపు ఎందుకు వెళ్ళావని నాన్న అడిగారు. పాల్ సరైన సమాధానం ఇవ్వలేకపోయాడు. నాన్న కోప్పడ్డారు.

మరో తమాషా జరిగింది. పియానో మీదున్న నీ పెద్ద ఫోటో గుర్తుందా? నువ్వు గ్రెగరీ పెక్‌ని ముద్దు పెట్టుకోవాలి అన్నట్లుగా చూసే ఫోటో గురించి. నేను డైనింగ్ రూమ్ తలుపులోంచి పాల్‌ని రహస్యంగా గమనించాను. పాల్ దాని దగ్గరికి వెళ్ళి, ఆ ఫోటోని అందుకుని దాదాపు నాలుగైదు నిమిషాలు దానివంకే చూస్తూ నిలబడ్డాడు. నాన్న ఫోన్లో మాట్లాడి ఆ గదిలోకి వస్తుంటే తిరిగి యధాస్థానంలో ఉంచాడు. వెంటనే పాల్ వెళ్ళిపోయాడు.

నిన్న టీచర్స్ మీటింగ్ వల్ల మాకు స్కూల్ లేదు. దాంతో శాలీ నేను తచ్చాడాం. మాల్టెడ్ మిల్క్ షాప్‌లో పాల్ మాకు తారసపడ్డాడు. అతను మా బల్ల దగ్గర ఆగి ఫుట్‌బాల్ కెప్టెన్ ఎలా ఉన్నాడని అడిగాడు. నువ్వు ఫోటో పంపావని చాలా అందంగా ఉన్నాడని చెప్పాను.

పత్తికాయల్లా కళ్ళు విప్పారిన శాలీ ఏదో మాట్లాడబోతుంటే, ఆమె మోకాళ్ళ కింద తన్ని నిశ్శబ్దంగా ఉంచాను. మళ్ళీ పాల్ కళ్ళల్లో మునుపటి విషాదం కనిపించింది.

**ఛీరియో అండ్ లవ్**

**మోలీ**

పి.ఎస్: దీన్ని నీకు స్పెషల్ డెలివరీలో పంపడానికి కారణం పాల్‌లోని విషాదం నువ్వు తెలుసుకోవాలని.

శనివారం

**డియర్ మిమీ.**

నిన్న రాత్రి నువ్వు రాసిన ఉత్తరం అందింది. నీకు నాకు మధ్య అకస్మాత్తుగా జరిగే ఉత్తరప్రత్యుత్తరాలికి అమ్మానాన్న ఏదో జరుగుతోందని అనుమానిస్తున్నారు. నువ్వు ఇంట్లో ఉంటే మనిద్దరం కుక్కల్లా పోట్లాడుకునేవాళ్ళం కాబట్టి అమ్మకి అసలు ఏమీ అర్థం కావడంలేదు.

నువ్వు పాల్‌ని మర్చిపోయి బోటనీ పాఠాలమీద కేంద్రీకరించటం మంచిదనిపిస్తోంది. ముఖ్యంగా నిన్న మధ్యాహ్నం అది జరిగాక. ముందుగా నువ్వు కాశ్మీర్ స్వెటర్‌ని వెనక్కి తీసుకోవచ్చు. నాకేదైనా బేబీ సిట్టింగ్ ఉద్యోగం వచ్చాక నువ్విచ్చిన అదనపు డబ్బుని కూడా నీకిచ్చేస్తాను. దీన్ని నీకు ఎలా చెప్పాలో సరిగ్గా తెలియటంలేదు. నిన్న మధ్యాహ్నం నేను పారిస్ షాప్కి శాలీ బట్టొ కొనడానికి తోడుగా వెళ్ళాను. దానికోసం శాలీ తన సైకిల్ అమ్మింది. మేం బయటికి వచ్చేసరికి పక్కనే ఉన్న బంగారు దుకాణంలో పాల్, సిల్వియా కనపడ్డారు. ఇద్దరూ ఆనందంగా ఉన్నారు. అతను ఆమెకి ఓ ఉంగరాన్ని చూపిస్తున్నాడు. నేను ఒట్టుపెట్టి చెప్పను కానీ అది నువ్వు తిరిగి ఇచ్చిన ఉంగరంలా ఉంది. నువ్వు ఆ పని చేయకుండా ఉండాసింది. వాళ్ళు మమ్మల్ని చూడలేదు. ఒకరి నడుము చుట్టూ మరొకరు చేతులు వేసుకుని ఉత్సాహంగా బయటికి నడిచారు. మేం వాళ్ళని రహస్యంగా అనుసరించాం. శాలీ మాత్రం మాటిమాటికి 'పాపం మిమీ. పాపం మిమీ' అనసాగింది. వీడు ఇలాంటివాడైతే మా అక్క అదృష్టవంతురాలు అని చెప్పాను.

నేను సిల్వియా మీద పగ తీర్చుకున్నాను. అది శాలీ ఆలోచన. శనివారం రాత్రి లేడీస్ లాంజ్‌లో ఏం జరిగిందో శాలీకి చెప్పాక ఆమె పని పడదాం అన్నది.

మేము ప్రెటిస్ హెడ్ క్వార్టర్స్‌కి వెళితే, పాల్ ఆఫీస్‌లో ఆమె కనిపించింది. అక్కడ గడ్డం గీసుకోవాల్సిన చాలామంది మగాళ్ళు కనిపించారు. మాకేం కావాలని ఒకరు అడిగారు. 'పాల్ హారిసన్‌కి సింగింగ్ టెలిగ్రామ్ తెచ్చామని శాలీ చెప్పింది. ఒక్కోసారి పాల్‌కి తెలివైన ఆలోచనలు వస్తూ ఉంటాయని వాళ్ళు నవ్వారు. మేము పాల్ దగ్గరికి వెళ్ళాము. నన్ను చూసి పాల్ ఆశ్చర్యంగా, 'మోలీ. ఇక్కడేం చేస్తున్నావ'ని అడిగాడు.

సిల్వియా లేచి నిలబడి, "ఈ పిల్లలు ఎవరు?' అని అడిగింది.

శాలీ నన్ను మోచేత్తో పొడవడంతో నేను చెప్పాను.

"నువ్వు పాల్‌ని ఓ పిచ్చి పేపర్ విలేకరి అన్నావు. రివేరాలోని లేడీస్ లాంజ్‌లో నువ్వు ఆ మాట అనడం విన్నాను. కాదని చెప్పకు."

"నేను ఈ పిల్లని నా జీవితంలో ఎన్నడూ చూడలేదు" ఆమె పాల్‌తో చెప్పింది.

"అలాగా? ఐతే నువ్వు ఇంటికి వెళ్ళి నీ వైట్ సాటిన్ ఈవినింగ్ గౌన్ వెనకాల చూడు. నా గుర్తుగా నేను వైల్డ్ స్ట్రాబెర్రీని అక్కడ రాసాను. ఆ లిప్‌స్టిక్ కోసం 69 సెంట్లు ఖర్చు చేసాను" నేను కోపంగా అరిచాను. ఆమె నా వంక కోపంగా చూస్తుంటే నేను పాల్‌తో చెప్పాను.

"వీళ్ళు నిన్ను కేవలం ఉపయోగించుకుంటున్నారు పాల్. ఎన్నికలు అయ్యేదాకా నిన్ను కట్టిపడేస్తే వీళ్ళ నాన్న యూరప్‌కి పంపిస్తాడని, అవసరమైతే నిన్ను పెళ్ళి చేసుకుని తర్వాత పాత సింగిల్ గ్లౌలా విసిరేస్తానని చెప్పింది."

అది చెప్పాక నాకు ఏడుపు వచ్చింది. పాల్ మొహాన్ని అప్పుడు నువ్వు చూడాల్సింది. అతను చెప్పాడు.

"సిల్వియా నువ్వు నటివై ఉండాలి. నేను ఇది నమ్ముతాను."

దాదాపు ముప్పై క్షణాలు ఆమె అతని వంక తీవ్రంగా చూసి తర్వాత పకపకా నవ్వుతూ అరిచింది.

"అవును. నువ్వు చెత్త పత్రికా విలేకరివి. మేము నిన్ను వాడుకున్నాం. ఇప్పుడు రహస్యం బయటపడింది కాబట్టి మళ్ళీ వెళ్ళి పత్రిక అమ్ముకో. బయటికి నడు" మళ్ళీ నవ్వసాగింది.

పాల్ కోటు, హాట్ అందుకుని చెప్పాడు, 'పదండి పిల్లలు.'

అతను తలుపు దాకా వెళ్ళాక సిల్వియా ఆపి చెప్పింది.

"ఇదిగో ఈ చెత్త ఉంగరం కూడా పట్టుకుపో."

పాల్ దాన్ని తీసుకుని జేబులో ఉంచుకున్నాడు.

బయటికి వచ్చాక అతను నవ్వి నా భుజాలు చరిచి చెప్పాడు.

"నన్ను రక్షించారు. పదండి మనకి పనుంది."

"నీ ఉంగరం నీకు రావడం అదృష్టం" శాలీ చెప్పింది.

"అవును. ఒక క్షణం అది రాదని భయపడ్డాను. అది ఇంకొకరికి అవసరం."

"ఛ. ఇంకొకరు ఉన్నారా? పూర్ మిమీ" శాలీ చెప్పింది.

నేను చేత్తో పొడిచి నోరు మూయించాను. మేము సరాసరి న్యూస్ పేపర్ ఆఫీస్‌కి వెళ్ళాం. పాల్ రోత్రో ప్రైవేట్ ఆఫీసులోకి వెళ్ళాడు. మేము రిసెప్షన్ గదిలో ఆగాం. లోపల పాల్ గట్టిగా బల్లమీద గుద్దుతూ మాట్లాడాడు. తర్వాత నెమ్మదిగా. అరగంట తర్వాత పాల్ బయటికి వచ్చాడు. అతని వెంటే బయటికి వచ్చిన రోత్రో అడిగాడు.

"వండర్‌ఫుల్ పాల్. ఈ ఊరి పాఠకులకి ఎన్నడూ చూడనంత పెద్ద సెన్సేషన్ ఇవ్వబోతున్నావు. ఇంత సాక్ష్యాన్ని ఎలా సేకరించావు?"

పాల్ నవ్వి చెప్పాడు.

"నేను ఇక్కడ ఉద్యోగం మానేయటంతో ప్రెటిస్ నన్ను నమ్మి చాలా నిజాలు చెప్పాడు. వాళ్ళని ఉరి తీసేంత సాక్ష్యాధారాలు మన దగ్గర ఉన్నాయి."

"క్షణం వృధా చేయకు. టైప్ రైటర్ ముందు కూర్చుని టైప్ చెయ్. నేను కంపోజింగ్ రూములో వాటిని కంపోజ్ చేయిస్తాను."

పాల్ మమ్మల్ని అడిగాడు.

"మీరిద్దరూ వెళ్ళి సాధ్యమైనంతమంది పిల్లలని పేపర్లు వేయడానికి తీసుకురాగలరా?" నేను అక్కడనించి టామీకి ఫోన్ చేసి అతన్ని మా టీంకి కెప్టెన్‌గా నియమించాను. పాల్ వేగంగా టైప్ చేస్తుంటే మేము చాలామంది పిల్లల్ని తీసుకొచ్చాం.

నేను ఎన్నడూ పత్రికాఫీస్‌ని చూడలేదు. ముఖ్యంగా స్పెషల్ ఎడిషన్‌ని తయారు చేస్తుంటే. ప్లేట్స్ యంత్రంతో తిరుగుతూ కాగితాలని వేయసాగాయి. అప్పటికే నలభైమంది పిల్లలం సిద్ధంగా ఉన్నాము. సర్కులేషన్ మేనేజర్ మేము ఎక్కడెక్కడికి వెళ్ళాలో సూచించాడు. కొందరికి సైకిళ్ళు ఉన్నాయి.

పాల్ రాసింది మొదటి పేజీలో పెద్ద హెడ్‌లైన్స్‌గా వచ్చింది. అది ప్రెటిస్ మనుషుల గురించి వివరించేది. రోత్రో ఎంతటి మృదువైన మనిషో నీకు తెలుసుగా? పాల్ భుజం మీద పదే పదే తడుతూ చెప్పసాగాడు.

"నువ్వు గొప్ప పని చేసావు."

ఆ పనంతా అయ్యాక పాల్ నన్ను పక్కకి తీసుకెళ్ళి అడిగాడు.

"ఆ ప్రదేశం పేరు ఏమిటి?"

"ఏ ప్రదేశం?"

"మీ అక్క మిమీ హాస్టల్ ఉన్న ప్రదేశం."

"దాని పేరు డెక్స్టర్ హాల్. నీ బల్లమీదే ఓ ఫోన్ ఉంది" చెప్పాను.

"సరే నేను ఆ ఫుట్‌బాల్ కెప్టెన్ గురించి వెంటనే కనుక్కుంటాను."

నేను గొణుగుతుంటే ఆగి వెనక్కి తిరిగాడు. అది నేను అల్లిన కట్టు కథ అని చెప్పాను. కొన్ని క్షణాలు అతను నన్ను కొడతాడు అనిపించింది. అతను వంగి నా బుగ్గ మీద సోదర భావంతో పెదాలతో స్పృశించి ఫోన్ వైపు పరిగెత్తాడు.

ఇదంతా నేను ఎందుకు రాస్తున్నానా? దీన్ని నేను పోస్ట్ చేయలేను. ఎందుకంటే నువ్వు సాయంత్రం రైలులో ఇంటికి వస్తున్నావని పాల్ చెప్పాడు. దీన్ని ఉంచుకుంటాను. నేను ప్రయత్నిస్తే రచయిత్రిని అవ్వచ్చని హాట్‌కిన్స్ చెప్పాడు. ఇదంతా ఓ కథలా రాసి, మోలీ 'ది ప్రైవేట్ ఐ' అనే కలం పేరుతో పాల్‌కి ఇస్తే తప్పకుండా అచ్చు వేస్తాడు.

**(వచ్చేనెల మరో కథ)**

Post your comments